భగవన్నామ ప్రభావం

పురాణపండ రాధాకృష్ణమూర్తి

ఓ మహోన్నత కోటికి చెందిన నామ నిష్ఠుడైన భగవద్భక్తుడు ఉండేవాడు. అతని దగ్గర అతని శిష్యుడూ ఉండేవాడు. ఓనాడు ఆ మహాత్ముడు కార్యార్థియై బయటకు వెళ్ళాడు. అదే సమయంలో ఆతని కుటీరం దగ్గరకు ఓ వ్యక్తి వచ్చి మహాత్ములవారు ఎక్కడ? అని ప్రశ్నించగా శిష్యుడు ''స్వామి వారు విశేష కార్యార్థులై బయటకు వెళ్ళారు. పని ఏమిటో చెప్పండి.'' అనగా ఆగంతకుడు మా అబ్బాయి తీవ్రంగా జబ్బుపడ్డాడు. వాడి ఆరోగ్యం బాగుపడాలి. మీరు ఏదైనా ఉపాయం చెప్పండి'' అని అర్థించాడు.

శిష్యుడు బదులు పలికాడు, ''అతి సుగమోపాయం ఒకటి ఉంది. ఓ తులసిదళంపై ముమ్మారు రామ నామం వ్రాసి ఆ దళాన్ని నీళ్ళలోవేసి ఆ తీర్థాన్ని త్రాగించండి, అంతే రోగం తగ్గిపోతుంది'' అన్నాడు.

ఆగంతకుడు స్వగృహానికి వెళ్ళిపోయాడు. మరునాడు ప్రసన్న చేతస్కుడై తిరిగి మహాత్ముని కుటీరానికి వచ్చాడు. అప్పటికే మహాత్ముడు కూడ వచ్చి ఉన్నాడు. అతని పాదాలపై సాష్టాంగపడి అతడు వినయంగా చేతులు జోడించి ''మీ శిష్యులు సిద్ధపురుషులు. నిన్నటి విషయం, నేనిక్కడకు వచ్చాను. తత్సమయంలో తమరు లేరు. మీ శిష్యులు మాత్రం ఉన్నారు. వీరివల్లనే నేను నా ప్రియపుత్రుని రోగనివృత్తికి ఉపాయాన్ని అడిగాను. అప్పుడీయన ముమ్మారు రామ నామాన్ని వ్రాసి ఆ తులసి దళాన్ని జలాలలోవేసి ఆ తీర్థాన్ని త్రాగించుమన్నారు. ఇంటికి వెళ్ళి నేను అలానే చేశాను. మహాశ్చర్య విషయం, అలా నేను చేసేసరికి నా బిడ్డ వెంటనే లేచి కూర్చున్నాడు. అసలతనికి ఏ రోగమూ లేనట్లే అనిపించింది'' అన్నాడు.

ఆ పలుకుల నాలకించిన మహాత్ముడు తన శిష్యుని కోపంగా మందలిస్తూ- ''ఒరేయ్ మూర్ఖుడా! ఈ సామాన్యమైన జబ్బుకోసం నువ్వు రామనామాన్ని ముమ్మారు ప్రయోగింపజేశావా? నామ మహిమను నువ్వు ఈషన్మాత్రం గ్రహించలేదన్నమాట. ఒక్కసారి నామోచ్చారణ చేసినంత మాత్రాన అనంతకోటి పాపాలూ, భవరోగమూ నాశనమవుతూండగా, మానవ మాత్రుడు అనామయమైన పరమపదాన్ని పొందుతున్నాడు. నువ్వీ ఆశ్రమంలో ఉండదగిన వాడవుకాదు. నీ ఇష్టం వచ్చిన చోటుకు వెళ్ళిపో'' అనగా శిష్యుని కళ్ళల్లో కన్నీళ్ళు నిండాయి. అతడు అనేక విధాల గురువును బ్రతిమాలాడు. సాధు పురుషులు నవనీత సములే కదా! ఆయన హృదయం ద్రవించి ఆ మహాత్ముడు శిష్యుని క్షమించాడు.

తరువాత ఆ మహాత్ముడు ధగధగ మెరిసే ఓ మెరుపు రాయిని తీసుకువచ్చి శిష్యునికిచ్చి ''నువ్వు నగరంలోకి వెళ్ళి దీని ధర కట్టి తీసుకురా? జాగ్రత్త. ఎంత ధర వచ్చినా దీనిని మాత్రం అమ్మకు. కేవలం ధర మాత్రం కట్టించుకురా? ఎవరు ఎంత ధర కట్టినదీ వ్రాసుకొని మాత్రం రా.'' అని పంపాడు.

దానిని తీసుకొని శిష్యుడు బజారుకు వెళ్ళాడు. ప్రప్రథమంగా ఆకు కూరలు అమ్ముకునే స్త్రీ కనిపించింది. శిష్యుడు రాయిని ఆమెకు చూపించి ''నువ్వు ఈ రాయికి అత్యధికంగా ఎంత ద్రవ్యం ఈయగలవు?'' అని ప్రశ్నించగా ఆ స్త్రీ- ఆ రాయి మెరుపునూ, అందాన్ని చూసి తన పిల్లలు ఆడుకుందుకు బాగున్నదని భావించి- ''దీనికి బదులు ఓ కిలో దుంపలుగాని నీకు నచ్చిన కూరలు కానీ తీసుకో'' అంది!

''అమ్మేది కాదులే'' అంటూ శిష్యుడు పురోగమించి ఓ షాపుదగ్గర కోమటిని కలిసి ''శెట్టిగారూ! ఈ రాయికి మీరు ఎంత ధర ఇస్తారో చెప్పండి'' అన్నాడు.

ఆ కోమటి యోచించి- ఇది బరువుగానూ, అందంగానూ, మెరుస్తూను ఉంది. వెండి బంగారాలు తూచుకునేందుకు బాగుంటుంది. అనుకొని ''ఓ రూపాయి ఇస్తాను'' అన్నాడు.

అందుకు తిరస్కరించి శిష్యుడు ముందుకు నడిచి ఓ కంసాలికి చూపించాడు. ఇది తనకు విశేషంగా పనికి వచ్చే వస్తువని తలచి దీనితో అనేకమైనవి తయారు చేసుకోవచ్చునని ''నేను వెయ్యి రూపాయలు ఇస్తాను'' అన్నాడు.

''అమ్మను!'' అంటూ శిష్యుడు [illegible] నడుస్తూ మహోత్సాహంతో రత్నాలూ, వజ్రాలూ [illegible] వ్యాపారి దుకాణం దగ్గరకు వచ్చాడు. గురుదేవు[illegible] రనుండి బయలుదేరినప్పుడతనికి రతనాల వ్యా[illegible] దగ్గరకు ఆదిలో వెళ్ళాలన్న సాహసం కలుగలేదు. [illegible] రాయి విలువ క్రమంగా పెరిగిపోవడంతో ఆ[illegible] సాహసం కూడా వర్ధిల్లింది. అతని దృష్టి కూడా మా[illegible] పోయింది. రతనాల వ్యాపారి దానిని వజ్రం[illegible] గ్రహించి లక్ష రూపాయలు యీయగలనన్నాడు. కా[illegible] అమ్మడానికి లేదు కదా! కనుక శిష్యుడు అతనికి కూ[illegible] అదే సమాధానం చెప్పి నగరంలోని పెద్ద పెద్ద వజ్రా[illegible] వ్యాపారుల దగ్గరకు వెళ్ళసాగాడు. అందరూ కందరూ కలిసి ఏకగ్రీవంగా ఐదుకోట్లు దాని విలువని నిశ్చయంగా చెప్పారు. చిట్టచివరగా ఆ శిష్యుడు రాజ్యాన్ని పాలించే మహారాజు దగ్గరకు వెళ్ళగా- మహారాజు అతణ్ణి సాదరంగా కూర్చోబెట్టి- ముఖ్యాతి ముఖ్యులైన వజ్రవ్యాపారుల నందరిని పిలిపించి, ''దీని ధరను కట్టిండి'' అన్నాడు.

అందరూ తర్జన, భర్జనలు చేసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ ''ప్రభూ! ఇట్టి రత్నాన్ని మేమెన్నడూ చూడనే లేదు, కనుక దీని ధరను కట్టడమంటే మా బుద్ధికి అతీతమైన విషయమే. దీనికి బదులుగా మీ రాజ్యాన్నంతటినీ ఇచ్చినా అది తక్కువే అని మా కనిపిస్తూన్నది.'' అన్నారు.

మహారాజు శిష్యుని ప్రశ్నించాడు. ''ఇట్టి అనుపమ రత్నం నీకెలా లభించింది?''

''దీనిని మా గురుదేవులు నాకిచ్చి అమ్మవద్దు. ధర మాత్రం తెలుసుకురా-'' అని పంపించినారు అన్నాడు శిష్యుడు.

అంత మహారాజు- ''దీని విలువ నా రాజ్యంకన్న మిన్న అయినది. దీనిని మీ గురుదేవులు విక్రయించదలిస్తే నా రాజ్యాన్నంతటినీ ఆనందంగా దీనికై ఇస్తాను. అని చెప్పు. ఈ విషయమై నువ్వు నీ పూజ్య గురుదేవులను సంప్రదించు'' అన్నాడు.

స్వామివారు ఉన్నత శ్రేణికి చెందిన మహాత్ములన్న విషయం అందరూ ఎరిగినదే కావడంవల్ల వారందరూ ఆ శిష్యుని సాదరంగా సాగనంపారు.

శిష్యుడు గురుదేవుని దగ్గరకు వచ్చి జరిగినదంతా చెప్పాడు. చివరగా ''గురుదేవా! ప్రభువులు దీనికి బదులుగా తన యావద్రాజ్యాన్నీ అర్పిస్తానంటున్నారు. కనుక దీనిని వారికిచ్చివేయడం మంచిది- అని నాకనిపిస్తున్నది.'' అనగా ఆ మహాత్ముడు- ''శిష్యా! దీని విలువ ముందు రాజ్యం ఏపాటిది? ఇంతవరకూ దీనికి తగిన విలువను ఎవరూ కట్టలేకపోయారు'' అన్నాడు.

శిష్యుడు ఆశ్చర్యపోతూ ''రాజ్యంకన్న ఇది విలువైనదా స్వామీ?'' అని ప్రశ్నించగా ''ఇక్కడ ఇనుప వస్తువేమైనా దొరుకుతుందా?'' అని గురువు ప్రశ్నించగా శిష్యుడు దొరుకుతాయండి. ఆశ్రమంలోకి యాత్రికులు కొందరు వచ్చారు. వారి దగ్గర సోల, తవ్వ, పెనం, మూకుడు ఇనుముతో చేసినవి ఉన్నాయండి. తమరు ఆదేశిస్తే వాటిలో ఏమైనా కొన్ని తీసుకువ

స్తాను'' అన్నాడు.

''తీసుకురా'' అని ఆ మహాత్ముడు పలుకగా శిష్యుడు కొన్ని లోహ నిర్మిత వస్తువులను తీసుకువచ్చాడు.

''శిష్యుడు లోహంతో (ఇనుముతో) చేసిన వస్తువులను తేగానే మహాత్ముడు తన దగ్గరున్న రాతితో వాటిని క్రమంగా స్పృశించేశాడు. చూస్తుండగా ఆ ఇనుప పాత్రలన్నీ మేలిమి బంగారు పాత్రలుగా మారిపోయాయి. అది చూచిన శిష్యునికి మహాశ్చర్యం కలిగింది. అతడు చకితుడై ''గురుదేవా! ఇది మహా విలక్షణ వస్తువే. దీనిపేరేమంటారు స్వామీ!'' అని ప్రశ్నించగా మహాత్ముడు- దీని పరశువేది అంటారు. స్పర్శమణి అని కూడ దీనే పిలుస్తారు. దీని స్పర్శ మాత్రంచే ఇనుము బంగారమౌతుంది. ఇప్పుడు దీని విలువ ఎంతో? అని ప్రశ్నించాడు. ''స్వామీ ఈ ప్రపంచంలో సర్వాధిక మూల్యమైనది- బంగారం. కేవలం అట్టి సువర్ణాన్నే తయారు చేస్తున్నది. దీని విలువను కట్టడం ఎవ్వరికీ సాధ్యంకాదు'' అన్నాడు శిష్యుడు.

అంత మహాత్ముడందుకున్నాడు, ''వత్సా! భవగన్నామం కంటికన్న విలువైనది. కారణమేమంటే ఈ పరశువేది జడ పదార్థం. దీనివల్ల జడ పదార్థాలే లభిస్తాయి. కానీ సచ్చిదానంత పరమాత్మ లభించడు. మరి సాంసారికమైన ఏ పదార్థంలోను భగవన్నామాన్ని ఇలకూచరాదు. దీని విలువను కట్టడమంటే పరశువేదితో కిలో అరకిలో కాయగూరలను తీసుకోవడం లాటిదే అవుతుంది. ఇంతకన్న మూర్ఖ విషయం కలదు. పరశువేది విలువ తెలియనివాడు తుచ్ఛ పదార్థాలను తీసుకొని దరిద్రుడుగానే ఉండిపోయే విధ్ధ రామ నామ మహిమను తెలియనివాడు కూడ పైన. పక్షుల దృష్ట్యా దరిద్రుడుగానే ఉండిపోతాడు. కనుక భగవన్నామ ప్రభావ, తత్త్వరహస్యాదులను తెలియక వాడవు కావడంవల్లనే సామాన్యమైన ఓ రోగ నివారణార్థం రామనామాన్ని ముమ్మారు ప్రయోగించావు. ఏ నామ ప్రభావంవల్ల భయంకర భగరోగాలు కూడ తొలగిపోతాయో అట్టి దానిని మామూలు రోగ నివారణ విషయమై ప్రయోగించడం వ్యర్థమే, అజ్ఞానమే అవుతుంది. నీ ఈ అజ్ఞానాన్ని దూరం చేయడం కోసమే నీకు పరశువేదిని ఇచ్చి పంపినాను.''

అదివిని శిష్యుడు భగవన్నామ ప్రభావాన్ని గుర్తించి తన పొరపాటును క్షమించుడని పదే పదే కోరాడు.

విలువ తెలియని వానికి పరశువేది లభిస్తే వాడు దానిని రెండు మూడు రూపాయల విలువకే అమ్మివేస్తాడు. ఆ మహాత్ముడు శిష్యునికి విక్రయాధికారాన్ని ఇచ్చివుంటే అతడు ఏడెనిమిది కిలోల కాయకూరలకే దానిని విక్రయించి వేసేవాడు, అదే దాని అత్యధిక మూల్యమని అతడు భావించి ఉండేవాడు. అట్లే భగవన్నామ ప్రభావాన్ని ఎరుగనివాడు దారపుత్ర ధనాదులకై దానిని విక్రయించివేస్తాడు.

భగవన్నామంలో పాపాలను నాశనంచేసే మహత్తరశక్తి ఉందనడంలో సందేహం ఎంతమాత్రం లేదు. కానీ ప్రజలు దీని రహస్యాన్ని గుర్తించజాలకున్నారు.



అందుకే దురపయోగం చేస్తున్నారు. నామంలో పాపాలను నాశనం చేసే అమోఘశక్తి ఉంది కనుక, మనం ఇంకా పాపాలు చేసి వాటి నాశనార్థం నామస్మరణ చేద్దాము అనుకుంటూ అధికాధికంగా పాపపంకిలంలో చిక్కుకుపోతున్నారు. వారి అభిప్రాయమే సక్రమమైనదైనచో నామజపం పాపవినాశకమైనది కాకుండ వాటిని వర్ధిల్లజేసేదే అవుతుందని స్పష్టమవుతున్నది. లేకుంటే సర్వులూ నామాన్ని ఆశ్రయించి స్వేచ్ఛగా పాపాలు చేస్తుంటారు. తద్వారా వర్తమానాన్ని అధిగమించి భవిష్యత్తులో పాపుల సంఖ్య వర్ధిల్లుతూంటుంది. పోలీసు దుస్తులను ధరించిన దొంగ- దొంగతనం చేసే దొంగకంటే అధిక దండనీయుడు అవుతాడు.

ఏమంటే వాని పాపాలు వజ్రాలపాలవుతాయి. అనుభవిస్తేకానీ నాశనంకావు. నామమనే ముసుగును ధరించి పాపాలను చేయడమంటే దశ నామాపరాధాలలో ఒకటి అవుతున్నది. దశనామాపరాధాలు ఇవి.

సన్నిన్దాసతి నామవైభవకథా శ్రీశేషయోర్భేదధీ
రశ్రద్ధాశ్రుతి శాస్త్రదైశికగిరాం నామ్యర్థవాదభ్రమః
నామాస్తీతి నిషిద్ధ వృత్తి విహితత్యాగౌ హి ధర్మాన్తరైః
సామ్యం నామ జపే శివస్య చ హరేర్నామాపరాధాదశ

1) సత్పురుషులను, భగవంతుని సేవించి ధ్యానించు వారలనింద. 2) శ్రద్ధలేనివారికి నామ మహిమను తెలియజేయుట. 3) శివకేశవుల నామ రూపాలలో భేదబుద్ధి కలిగియుండుట. 4,5,6) వేద శాస్త్రాలూ గురువూ చెప్పిన నామమహాత్మ్యము నందు అవిశ్వాసము. 7) హరినామంలో అర్థవాద భ్రమ అంటే నామమహిమ కేవలం శ్రుతిమాత్రమ నడం. 8,9) నామ బలంపై విహిత్రాన్ని త్యజించి, నిషిద్ధాన్ని ఆచరించడం, అన్యమతాలతో నామ తులన అంటే శాస్త్ర విహిత కర్మలతో నామ తులన- ఇవన్నీ శివకేశవుల నామ జపంలో దశనామపరాధాలుగా చెప్పబడ్డాయి.

ఈ దశాపరాధాలనుండీ తనను రక్షించుకోకుండ నామజపం చేసేవారు నామరహస్యాన్ని గ్రహించలేదన్న మాటయే.

వాక్కు ద్వారా నామాన్ని జపించడం కంటే మనసా జపించడంవల్ల నూరు రెట్లు లాభదాయకమౌతుంది. మానసిక జపం కూడ శ్రద్ధతో ప్రేమగా చేయడంవల్ల అనంత ఫలాలు లభిస్తాయి. దానినే గుప్తంగా నిష్కామ భావంతో చేస్తే పరమాత్మ లభిస్తాడు. కనుక ఈ రహస్యాన్ని గుర్తించి భగవన్నామాన్ని ఆశ్రయించాలి.

అని వివరించాడు మహాత్ముడు.

★